క్లుప్తంగా

పైడమ్మ అమ్మవారి నూతన ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ



పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి ఆలయంలో నూతన ఉత్సవ విగ్రహం ప్రతిష్ఠ శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 7.35 గంటలకు విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆలయ ఈఓ తిక్కిశెట్టి మోహనరావు ఆధ్వర్యంలో పైడమ్మ అమ్మవారి పుట్టింటి, మెట్టినింటి వారు ఆయా క్రతువులను భక్తిశ్రద్ధలతో నిర్వహించి అమ్మవారిని ఆలయం లోపలికి తీసుకువెళ్లారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

స్వామి వారికి వెండి వస్తువుల సమర్పణ



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి చిలకలూరిపేటకు చెందిన సోమేపల్లి హర్షవర్ధనాదేవి కిలో వెండి వస్తువులు సమర్పించారు. శనివారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న ఆమె రెండు వెండి శఠారిలు, ఒక వెండి ప్లేటు, ఒక వెండి స్పూను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందజేశారు. మరో భక్తురాలు ప్రకాశం జిల్లా సంతమాగులూరుకు చెందిన పెనుమాక మురళీ కృష్ణవేణి 300 గ్రాముల వెండి ప్లేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా చోడిశెట్టి అమ్మగారమ్మ జాతర



రేమాలవారిపాలెం(నాగాయలంక): రేమాలవారిపాలెం గ్రామంలోని చోడిశెట్టి అమ్మగారమ్మ దేవస్థానంలో వార్షిక జాతర మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా నాగాయలంక కృష్ణానదిలోకి తీసుకువెళ్లి శుద్ధి చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఘటాలను పూజారులు తలపై ధరించి డప్పు నృత్యాలు, మేళతాళాలతో నాగాయలంక వీధుల గుండా ఊరేగింపుగా గ్రామానికి తరలించారు. ఘటాలకు గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రంతా గ్రామంలో తిరిగి ఆదివారం తెల్లవారుజామున ఘటాలు గుడికి చేరుకోవడంతో సంప్రదాయ రీతిలో గుడి జాతర, భక్తుల మొక్కుబడుల సమర్పణ ఉంటుందని కమిటీ చైర్మన్ చోడిశెట్టి పెదబాబు తెలిపారు.

మల్లవోలులో మూడు పూరిళ్లు దగ్ధం

రూ.6.5 లక్షల ఆస్తి నష్టం



గూడూరు: గూడూరు మండలం మల్లవోలులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు కుటుంబాలు వీధిన పడ్డాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు అధికారులు గుర్తించారు. మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో షేక్ జమీలున్నీసా, షేక్ హమీదున్నీసా, షేక్ రబీబ్‌లకు చెందిన మూడు తాటాకు ఇళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. షేక్ ఉస్మాన్‌కు చెందిన రేకుల షెడ్డు పాక్షికంగా కాలింది. ఉవ్వెత్తున ఎగసిన అగ్నికీలలను గుర్తించిన చుట్టుపక్కల వారు బాధితులను రక్షించడానికి సహాయ చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న బందరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. సర్పంచి బొర్రా సాంబశివయ్య, ఆర్బీకే చైర్మన్ పర్నం పెదబాబు బాధితులను పరామర్శించారు. నిరాశ్రయులైన ఒక్కో కుటుంబానికి రూ.3 వేల నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు.

గడ్డి వామి దగ్ధం

గ్రామంలో నాలుగు ఇళ్లు అగ్నికి ఆహుతైన ఘటన చల్లారక ముందే రైతు ఆలపాటి వెంకటేశ్వరరావుకు చెందిన ఐదు ఎకరాల గడ్డి వామి దగ్ధమైంది. గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి పడేసిన సిగరెట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. బందరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది.

నాడు-నేడుతో నవశకం

- విద్యకు జగన్ ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయం
- తీరప్రాంతంలో అభివృద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాలలు
- నాగాయలంక మండలంలో మూడొంతులు 'నాడు-నేడు' పూర్తి
- పాఠశాలలకు చేరిన నూరు శాతం జగనన్న విద్యా కానుక



వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధాన తరగతి గది



వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధాన తరగతి గది




వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల మరుగుదొడ్లు



వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల మరుగుదొడ్లు

నాగాయలంక: నాగాయలంక మండలం సముద్ర తీరంలో గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, సౌకర్యాల లేమి సమస్యలు ఉండేవి. టాయిలెట్స్ కూడా సరిగా ఉండేవికాదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఫలితంగా దశాబ్దాలుగా నిరాదరణకు గురైన ప్రభుత్వ పాఠశాలలు నేడు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయి. సకల వసతులు, సౌకర్యాలు కల్పించడంతో గ్రామస్తుల ఆదరణ కూడా లభిస్తోంది. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరగడంతోపాటు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యను పెంపొందించేందుకు నాడు-నేడు ఫేజ్-1 కింద మండలంలోని ఐదు పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, రెండు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఈ విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభానికి అయిదు రోజుల ముందుగానే నూరు శాతం జగనన్న కానుకల మెటీరియల్ ఆయా పాఠశాలలకు చేరాయి.



నాడు-నేడు మొదటి దశలో అభివృద్ధి..

మండలంలో మొదటి దశ నాడు-నేడు కింద రూ.4.85 కోట్లతో 25 పాఠశాలల అభివృద్ధి చేపట్టి నూరు శాతం పూర్తి చేశారు. వీటిలో 15 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, ఒక హైస్కూల్ ఉన్నాయి. నాడు-నేడు పథకం రెండో దశలో రూ.5.22 కోట్లతో 17 పాఠశాలలకు అభివృద్ధి నిధులు కేటాయించారు. ఈ దశలో ఏడు ప్రాథమిక పాఠశాలలు, ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు, మూడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. రెండో దశ పనులు కూడా 75 నుంచి 80 శాతం పూర్తయ్యాయి. ఈ పథకం కింద పాఠశాలలకు టాయిలెట్స్, తరగతి గదులు, పాఠశాల మరమ్మతులు, తాగునీరు, విద్యుద్దీకరణ, ఇంగ్లిష్ మీడియం, ల్యాబ్, ఫర్నిచర్, గ్రీన్‌బోర్డు, పాఠశాల రంగులు సమకూరాయి.

బాలికల కళాశాల ఏర్పాటు..

2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేయగా నాగాయలంక జెడ్పీ హైస్కూల్‌తో అనుబంధంగా దీనిని ఏర్పాటు చేశారు. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అవకాశం లేదని గత ప్రభుత్వం ఆటంకం కలిగించిన తరుణంలో ఏకంగా బాలికల కళాశాలనే ప్రభుత్వం మండల కేంద్రానికి కేటాయించింది.

ఎంతో అభివృద్ధి జరిగింది



ముఖ్యమంత్రి చేపట్టిన విద్యావిధానం నవశకానికి నాంది పలికింది. ఉపాధ్యాయులు కూడా ఆంగ్ల మాధ్యమంపై శ్రద్ధ పెడితే ప్రభుత్వ పాఠశాలలకు మరిన్ని సత్ఫలితాలు అందుతాయి. మండలంలో 75 శాతం పాఠశాలల్లో నాడు-నేడు అభివృద్ధి పనులు జరిగాయి. ఇలాంటి సముద్ర తీర ప్రాంత మండలాల్లో విద్యాభివృద్ధి జగన్ ప్రభుత్వంలోనే సాధ్యమైంది.

-టీవీఎం రామదాసు, ఎంఈఓ, నాగాయలంక

ఇన్ని మార్పులు ఊహించలేదు



విద్యా విధానంలో ఇన్ని మార్పులు, అభివృద్ధిని ఊహించలేదు. ఒకే ఒక్క పెంకుటిల్లుగా ఉండే మా ఊరి ప్రాథమిక పాఠశాల నాడు-నేడు పథకంతో అధునాతన హంగులతో రూపొందడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచే ఇన్ని సౌకర్యాలు కల్పించడంతో ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలు ఖచ్చితంగా అధిగమిస్తాయి.

- అంబటి శ్యామ్ ప్రసాద్, సర్పంచి, వక్కపట్లవారిపాలెం,

ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు బాగున్నాయి



మాది వ్యవసాయ కుటుంబం. ప్రైవేట్ పాఠశాలలకు పంపించాలంటే వెసులు బాటు ఉండేది కాదు. ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలంటే సౌకర్యాలు ఉండేవి కావు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా సౌకర్యాలు, వసతులు కల్పించారు. మాకు ఇద్దరు కుమార్తెలు జాహ్నవి లక్ష్మి 8వ తరగతి, కావ్యశ్రీ 6వ తరగతి చదువు తున్నారు. గతంలో వారిని ప్రైవేట్ స్కూల్‌కు పంపేవాళ్లం. జగన్ ప్రభుత్వంలో పాఠశాలలు అభివృద్ధి చెందడంతో పిల్లలను గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకే పంపిస్తున్నాం. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి మాలాంటి మధ్యతరగతి కుటుంబాలను ఆదుకుంది. పదో తరగతిలో మంచి ఫలితాల కోసం అదనంగా టీచర్లే స్కూల్‌లో ట్యూషన్లు చెబుతున్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, క్రమం తప్పకుండా అందుతున్నాయి. గోరుముద్ద మెనూలో రాగి జావ అందించడం ఎంతో బాగుంది.

-మలిశెట్టి వసుధ, పేరెంట్, భావదేవరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

మెరుగైన విద్యా విధానం



మాది సామన్య కుటుంబం. పోటీపడి ప్రైవేటు పాఠశాలల్లో చదివించాలంటే ఆర్థిక పరిస్థితులు సహకరించేవి కావు. విద్యా విధానంలో వచ్చిన మార్పులు, అభివృద్ధితో మాలంటి సామాన్యులకు ఎంతో మేలు జరిగింది. మా పాప మోక్షజ్ఞ మాఊరులోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. మా అబ్బాయి అయిదు వరకు ఇక్కడ చదివి ఇప్పుడు నాగాయలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఇది వరకు గ్రామంలోని పాఠశాలలో ఆడపిల్లలు టాయిలెట్స్‌కు పోవాలంటే అనేక అవమానాలతో ఇబ్బంది పడేవారు. సీఎం జగన్ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో అలాంటి అవమానాలను అధిగమించగలిగారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక పథకాలతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా ఊరట లభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య అందుతోంది.

-వక్కపట్ల లీలామారుతి, పేరెంట్, వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల

రాములవారి గుడిలో విగ్రహాల ప్రతిష్ఠ



మచిలీపట్నంటౌన్: సర్కారుతోటలోని రాములవారి గుడి పునర్నిర్మాణ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శీలం లీలా వరప్రసాదరావు (ఎస్ఎల్‌వీ), లక్ష్మీనిర్మల రత్నాదేవి జ్ఞాపకార్థం శీలం బాబ్జీ, భారతి దంపతులు పాలరాతి విగ్రహాలను ఆలయానికి అందజేశారు. ఈ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయానికి విగ్రహాలను అందజేసిన బాబ్జీ, భారతి దంపతులను భక్తులు అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యార్థుల సందడి



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. శనివారం విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తకాలు, పత్రికలు చదివారు. కథలు విన్నారు. భగవద్గీత శ్లోకాలు పఠించి స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకున్నారు. కోలాటం భజన చేశారు. ఉపాధ్యాయుడు ఎస్. విజయ్ స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించారు. విద్యార్థులు ఇప్పటివరకు నేర్చుకున్న పద్యాలు, పాటలపై పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయిని ఉమా సరస్వతి పోటీలను పర్యవేక్షించారు. ఈడేపల్లి, చిలకలపూడి శాఖా గ్రంథాలయాల్లో చిన్నారులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఉప గ్రంథాలయాధికారి ఎం వీడీటీ నగేష్, శాఖా గ్రంథాలయ అధికారులు వెంకటేశ్వరమ్మ, సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం



గ్రామోత్సవంలో కళాకారుల విన్యాసాలు

బంటుమిల్లి: చినతుమ్మిడి గ్రామంలోని అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్రం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని డీజీ వెలివెల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వగ్రామం చినతుమ్మిడిలో సుమారు 50 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామివారికి విశేష పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. సాయంత్రం నిర్వహించిన గ్రామోత్సవంలో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. సీతారాములు వనవాసం, పట్టాభిషేకం, రాక్షసులు, వానర సైన్యం వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలు కూడళ్ల వద్ద వానరులు, రాక్షసుల మధ్య జరిగిన యుద్ధ సన్నివేశాలు అలరించాయి. ఎంపీపీ వి. చినబాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మోటారు సైకిల్ ర్యాలీలో పలు గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు పోషకాహారం అందించాలి



రామరాజుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గూడూరు: కిశోర బాలికలకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కె.గ్లోరి తల్లిదండ్రులకు సూచించారు. గూడూరు మండలం రామరాజుపాలెంలో సమగ్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ స్థాయిలో కార్యక్రమాలు ప్రతి ఇంటా నిర్వహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకే గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించి తల్లుల్లో చైతన్యం తీసుకు వస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి పరసా రాజులు, సూపర్‌వైజర్ జన్ను రేవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏమి హాయిలే అలా..!





భానుడు శనివారం ప్రతాపం చూపాడు. ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. కొందరు నాగాయలంకలోని శ్రీరామ పాద క్షేత్రం ఘాట్ వద్దకు చేరుకుని సేద తీరారు. కొందరు బాలలు, యువకులు కృష్ణానదిలో ఈత కొడుతూ కేరింతలు కొట్టారు. గ్రామానికి చెందిన కనిగంటి వెంకట నారాయణ పెంపుడు కుక్క ఆయనతోపాటు ఘాట్‌కు చేరుకుంది. యువకుల కేరింతలతో శునకం నదిలోకి ఉరుకుతూ విన్యాసాలు ప్రదర్శించింది.

-నాగాయలంక

బెల్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్ గెలుపు

మచిలీపట్నంటౌన్: స్థానిక బెల్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆంధ్ర సైంటిఫిక్ కంపెనీ వర్కర్స్ యూనియన్ (హెచ్‌ఎంఎస్) సంఘం ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్ ఒంటరిగా పోటీకి దిగగా ఎస్‌ఎంయూ, ఎంప్లాయీస్ యూనియన్ కలిసి పోటీ చేశాయి. మొత్తం 74 ఓట్లు పోలవగా హెచ్‌ఎంఎస్‌కు 45, ఎస్‌ఎంయూకు 29 ఓట్లు లభించాయి. 16 ఓట్లతో హెచ్‌ఎంఎస్ గెలుపొందింది. గత 20 ఏళ్లుగా తిరుగు లేకుండా గుర్తింపు సంఘంగా ఎన్నికవుతూ వస్తున్న ఎస్‌ఎంయూ ఈ ఎన్నికల్లో ఓటమి పాలైంది. గుర్తింపు సంఘం గౌరవాధ్యక్షుడిగా జె. వరప్రసాద్, అధ్యక్షుడిగా బీడీకే నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. రాజారావు, కోశాధికారిగా పి. పుష్పారావు, ఉపాధ్యక్షులుగా ఎస్. వెంకటేశ్వరరావు, పీటీకే ప్రసాద్, అసోసియేట్ సెక్రటరీగా పి. నాగమోహన్, జాయింట్ సెక్రటరీగా జీవీ రాజారావు ఎన్నికయ్యారు. హెచ్‌ఎంఎస్ సంఘ నాయకులు ప్రధాన రహదారిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ ప్రారంభించారు. కృష్ణానది తీరంలోని పర్యాటక శాఖ ఫుడ్ కోర్టు భవనంలో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించిన శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 102 మందిని ఐఓఎల్ ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరిని ఆదివారం ఆస్పత్రికి తీసుకువెళ్లి శస్త్ర చికిత్స చేయిస్తామని రఘుశేఖర్ తెలిపారు. గత ఏప్రిల్‌లో జరిగిన శిబిరంలో కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి రివ్యూ, అవగాహన నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ సంకల్ప్ నేత్ర పరీక్షలు చేశారు. కంటి ఆస్పత్రి క్యాంప్ ఇంచార్జి సైదులు, తలశిల లీలా మనోహర్, జమీలా మస్తాన్ పాల్గొన్నారు.

నూతన విద్యా సంవత్సరానికి పాఠశాలలు సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఫేజ్-2లో అభివృద్ధి చేసిన పెదప్రోలు ప్రాథమిక పాఠశాల



ముస్తాబైన గురుకుల పాఠశాల

- శరవేగంగా ఫేజ్-2లో 'నాడు- నేడు' పనులు
- రేపటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

మోపిదేవి: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభానికి సిద్ధమయ్యాయి. సోమవారం పాఠశాలలను పునఃప్రారంభించనున్నారు. మండలంలోని 42 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు 2,585 మందికి గాను అవసరమైన టెస్ట్‌బుక్స్, నోట్స్ బుక్స్‌తో పాటు జగనన్న విద్యా కానుక కింద ప్రతి విద్యార్థికి యూనిఫాం, బ్యాగ్, షూస్, బెల్ట్, డిక్షనరీలు పాఠశాల ప్రారంభం తొలిరోజునే అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ కె. రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని 28 ప్రాథమిక, 5 యూపీ, 9 జెడ్పీ పాఠశాలలు మొత్తం 42 పాఠశాలల్లో ప్రాథమిక దశ నుంచే విద్యపై పట్టు సాధించేందుకు ఒకటో తరగతి చదువుతున్న 1,826 మందికి డిక్షనరీలు, 6వ తరగతి చదువుతున్న 327 మంది విద్యార్థులకు మరో రకమైన డిక్షనరీలు అందచేయనున్నారు. మన బడి నాడు-నేడు కింద మండలంలో ఫేజ్-1లో 12 పాఠశాలలను రూ. 5,86,30,908 నిధులతో అభివృద్ధి చేయగా, ఫేజ్-2లో మరో 12 పాఠశాలలను రూ. 2,59,97,000, మోపిదేవి జెడ్పీ పాఠశాలను నాబార్డ్ నిధులు రూ. 84.60 లక్షలతో అభివృద్ధి చేస్తు న్నారు. గత విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించడంతో ఉపాధ్యాయులు ప్రచా రం నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని ఎంఈఓ రాజ్‌కుమార్ వివరించారు.

చిన్నారుల భవితకు అంగన్‌వాడీల్లో పునాది



ర్యాలీలో పాల్గొన్న చారుమతి తదితరులు

పెడన: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల విద్యకు గట్టి పునాది ఏర్పడుతుందని పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి అన్నారు. శనివారం పెనుమల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జనభాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ర్యాలీని చారుమతి ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులను అంగన్‌వాడీ బాట పట్టించడంలో తల్లిదండ్రులు, బంధువులు కీలకపాత్ర పోషించాలన్నారు. అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన జరుగుతుందని చెప్పారు. పెనుమల్లి అంగన్‌వాడీ కార్యకర్త కనక దుర్గ, ఉషాకుమారి, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

■ మండలంలోని నందమూరులో జరిగిన కార్యక్రమంలో కట్టా కృష్ణకుమారి, శేషారత్నం, నాగమణి తదితరులు పాల్గొన్నారు. ముచ్చర్ల అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన జనభాగీదారి కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్ద జగన్‌మోహనరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లేశ్వరి, దుర్గ తదితరులు పాల్గొన్నారు. చోడవరంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటపద్మ తదితరులు పాల్గొన్నారు.

దోవారి వీరాస్వామికి నివాళి



మచిలీపట్నంటౌన్: దేవదాయశాఖ రిటైర్డ్ ఉద్యోగి దోవారీ వీరాస్వామి (87) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. వీరాస్వామి మృతదేహాన్ని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సందర్శించి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. దోవారి వీరాస్వామి గూడూరు సమితి ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అనంతరం దేవదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా, ఆంధ్ర జాతీయ కళాశాల కరస్పాండెంట్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మాజీ మంత్రి పేర్ని కృష్ణమూర్తికి, వీరాస్వామికి మంచి అనుబంధం ఉండేది. వీరాస్వామి మృతదేహాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్‌నోబుల్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, షేక్ అచ్చెబా, పలువురు కార్పొరేటర్లు నివాళులర్పించారు.